

రైతువేదిక ప్రాంగణంలో తాగి పడేసిన మద్యం సీసాలు







బెస్తవాళ్ల జాతరలో బోనమెత్తిన జోగిని నిషారాణితో జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, బోనమెత్తిన నిర్మలా జగ్గారెడ్డి, జయారెడ్డి, చిరునవ్వులు చిందిస్తున్న జగ్గారెడ్డి

బెస్తోల్ల బోనాల జాతర

పాల్గొన్న జగ్గారెడ్డి, సతీమణి నిర్మల, కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్ సాయిరెడ్డి, జోగిని నిషారాణి

సంగారెడ్డి టౌన్, జూలై 28 : సంగారెడ్డి పట్టణంలో ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని బెస్తోల్ల ఆధ్వర్యంలో జరిగిన బోనాల జాతర ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోపాటు ఆయన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్‌సాయిరెడ్డి, జోగిని నిషారాణి పాల్గొన్నారు. వేలాదిగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. వందలాది మంది కళాకారులు వివిధ దేవతా మూర్తుల వేషధారణాలో అలరించారు. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతరాజులతో కలిసి జగ్గారెడ్డి, భరత్‌సాయిరెడ్డిలు చేసిన నృత్యాలు అభిమానులు, భక్తుల్లో జోష్‌ను నింపాయి. జోగిని నిషారాణి బోనం ఎత్తుకుని చేసిన నృత్యం ఆకట్టుకున్నది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పట్టణమంతా అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.



కల్పగూర్ గ్రామ పరిధిలోని అంగడి పేటలో నిరుపయోగంగా మారిన రైతువేదిక భవనం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రైతువేదికలు

అన్నదాతల కోసం నిర్మించిన రైతువేదిక భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. గత ప్రభుత్వం హయాంలో ఒక్కోటి రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలను చాలాచోట్ల వినియోగించకపోవడంతో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి కళావిహీనంగా మారాయి. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ పరిధిలోని అంగడిపేటలో ఉన్న రైతువేదిక భవనం మందుబాబులు అడ్డాగా మారింది. రైతువేదిక ప్రాంగణంలో ఇలా.. ఎక్కడపడితే అక్కడ తాగిపడేసిన సీసాలు దర్శనమిస్తున్నాయి.

-సంగారెడ్డి రూరల్

ఒక్క మొక్కా నాటలే..!

16 ప్రభుత్వ శాఖల్లో ఇదే పరిస్థితి

మెదక్ జిల్లాలో వనమహోత్సవంపై నిర్లక్ష్యం

వానాకాల సగం గడిచినా మొదలే పెట్టని వైనం

మెదక్ అర్బన్, జూలై 28: పచ్చదనం, అటవీ విస్తీర్ణం పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవంపై కొన్ని ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. శాఖలవారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడ్డాయి. వారం రోజులుగా మెదక్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలు మాత్రమే మొక్కలు నాటుతుండగా.. మిగితా శాఖలు ఇప్పటివరకు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. 16 ప్రభుత్వ శాఖలైతే ఒక్క మొక్కను నాటకపోవడం గమనార్హం. జిల్లాలో ఏడాది మొత్తం 34..08 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధేశించగా.. ఇప్పటివరకు కేవలం 17లక్షలు మాత్రమే నాటినట్లు అధికారిక గుణాంకాలు పేర్కొంటున్నాయి.

రెండు శాఖలు మాత్రమే..

మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం వనమహోత్సవం కింద 34.08 లక్షల మొక్కలు నాటలని 23 ప్రభుత్వ శాఖలకు లక్ష్యం విధించారు. ఇందుకోసం అటవీశాఖ, పంచాయతీ, మున్సిపాలిటీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచారు. అత్యధికంగా డీఆర్‌డీవోకు 18 లక్షలు, అటవీశాఖకు 10 లక్షల మేర మొక్కలు నాటే లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు ఈ రెండు శాఖలు మాత్రమే మొక్కలు నాటుతున్నాయి. ఇందులో గ్రామీణాభివృద్ధిశాఖ 13.68 లక్షల (76శాతం) మొక్కలను, అటవీశాఖ 4.02 లక్షల (40.20శాతం) మొక్కలను నాటాయి.

మున్సిపాలిటీల వెనుకంజ

నర్సాపూర్ మున్సిపాలిటీలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యం ఇవ్వగా ఇప్పటి వరకు కేవలం 3 వేల మొక్కలు నాటారు. రామాయంపేట మున్సిపాలిటీలో 25 వేల లక్ష్యం నిర్దేశించగా 1,500, జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపాలిటీలో 75 వేల మొక్కలకుగాను 125 మొక్కలను నాటారు. ఎక్సైజ్‌శాఖ లక్ష్యం 30 వేలు కాగా.. 4,850, పరిశ్రమలశాఖకు 30వేల లక్ష్యం నిర్దేశించగా 2,500 మొక్కలు మాత్రమే నాటడం వనమహోత్సవంపై వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనం. ప్రతీ ఇంటికి ఆరు చొప్పున పూలు, పండ్ల మొక్కలు అందిస్తున్నామంటున్నా క్షేత్రస్థాయిలో ఆచరించడం లేదు.

ఒక్క మొక్కా నాటని శాఖలివే..

జిల్లాలో 16 ప్రభుత్వ శాఖలు ఇప్పటివరకు వన మహోత్సవాన్ని ప్రారంభించలేదు. వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఉద్యానవనశాఖ, ఇరిగేషన్, మార్కెటింగ్, వైద్య ఆరోగ్య, మైనింగ్, మైనార్టీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, తూప్రాన్ మున్సిపాలిటీ, పోలీసుశాఖ, విద్యుత్‌శాఖ, మహిళాశిశు సంక్షేమ, పశుసంవర్ధకశాఖలు ఇప్పటి వరకు ఒక్క మొక్క కూడా నాటలేదు. వనమహోత్సవంపై పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి.

నాటిన మొక్కలకు రక్షణ కరవు

జిల్లాలో కొన్ని ప్రభుత్వ శాఖలు మొక్కలు నాటుతున్నప్పటికీ వాటిని సంరక్షించే చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నాటిన మొక్కలు మేకలు, పశువులకు ఆహారంగా మారుతున్నాయి.

నీళ్లు లేక వెలవెలబోతున్న సింగూరు కాలువ



ఎగువకు ఎదురుచూపు..

జలధార కరువైన 'మంజీర'

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాభావం

నిండు వర్షాకాలంలోనూ నిండని ప్రాజెక్టు

ముసురు వానలతో స్వల్ప వరద

ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

వానాకాలం రెండు నెలలు గడుస్తున్నా మంజీర గలగలలు వినిపించడం లేదు. ఎగువ నుంచి వరద రాక.. స్థానికంగా పెద్ద వర్షాలు లేక మంజీరా ప్రాజెక్టు నిండడం లేదు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి చెప్పుకోదగ్గ స్థాయిలో వరద ప్రవాహం రాలేదు. ఫలితంగా ఆయకట్టు స్థిరీకరణ ప్రశ్నార్థకంగా మారింది. అదను దాటుతున్నా కాల్వల్లో నీరు వదల అన్నదాతలు ఆందోళన ఉసూరుమంటున్నారు.



సింగూరు ప్రాజెక్టు గేట్లు

పుల్‌కల్, జూలై 28: మంజీర నది జన్మస్థానం బీడ్ జిల్లాలోని పటోడా తాలుకా బాలాఘాట్ పర్వతశ్రేణి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల గుండా ప్రవహిస్తుంది. మంజీర నదిపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో వరద ప్రవాహం రావడం లేదు. మంజీర నదికి ఆయువుపట్టు లాంటి మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నది. తెలంగాణ రాష్ట్రంలో మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలైన జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో, వరద కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

సేద్యానికి సరఫరా లేదు

ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు సింగూరు ప్రాజెక్టు జలాలు సేద్యానికి సరఫరా చేయలేదు. ప్రధానమైన ఎడమ కాలువ ద్వారా నీరు వదలడానికి ప్రాజెక్టులో సరిపోను నీటి నిల్వలు లేవు. ఎత్తిపోతల ద్వారా నీటిని పంపింగ్ చేయడానికి అవకాశం ఉన్నా.. నీటిపారుదలశాఖ అధికారులు ముందుకు రావడం లేదు. ప్రతీ ఏటా జూలై నెలాఖరు నాటికల్లా ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు చేరేవి. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వచ్చినప్పటికీ, వాతావరణ పరిస్థితుల కారణంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. మంజీర నది పరివాహక ప్రాంతంలో గడిచిన వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న మోస్తారు వర్షానికి ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీటి రాక ప్రారంభమైంది. నదీ తీర ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకైనా ప్రాజెక్టు నిండుతుందన్న ఆశ రైతుల్లో చిగురిస్తున్నది.

వరి నాట్లకు అదను దాటుతోంది..

వరి నాట్ల సీజన్ అదను దాటుతుండటంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేక.. ప్రధానమైన ఎడమ కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని వదిలే పరిస్థితి లేదు. ఉన్న నీటిని ఎత్తిపోతల ద్వారా సరఫరా చేస్తారనుకుంటే అది కూడా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావుల వద్ద వరి నాట్లు ఊపందుకోగా.. కాలువలపై ఆధారపడిన రైతులు మాత్రం దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వానాకాలం సీజన్‌కు సింగూరు జలాలు అందుతాయని ఎంతో ఆశగా ఉన్న రైతన్నకు ఎదురుచూపులే మిగిలాయి. జిల్లా మంత్రి మంత్రి దామోదర్ రాజనరసింహ కల్పించుకుని ఎత్తిపోతల ద్వారా సింగూరు జలాలను సేద్యానికి ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను తక్కువ మోతాదులోనైనా జలాలను సరఫరా చేస్తే వరి నాట్లు వేసుకుంటామని ఆశగా ఎదురు చూస్తున్నారు.



సింగూరు ఆయకట్టులో ముదిరిపోయిన వరి నారు

తాగునీటికి ప్రాధాన్యం

సింగూరు ప్రాజెక్టులో నిల్వ నీటిని ప్రజల తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత కల్పిస్తున్నారు. హైదరాబాద్-సికిందరాబాద్‌లతో పాటుగా 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ప్రజానీకానికి పూర్తి స్థాయిలో మంజీర జలాలను అందిచాలన్నదే ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుకు కుడి, ఎడమ వైపుల నది బ్యాక్ వాటర్ అంతర్భాగంలో రెండు భారీ తాగునీటి పథకాలను నిర్మించింది. ప్రస్తుతం 14 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉండటంతో తాగునీటి పథకాల లక్ష్యం దెబ్బతింటుందన్న ఉద్దేశంతోనే సాగుకు జలాలు సరఫరా చేయడంలేదని అంటున్నారు.

ఇన్‌ఫ్లో 3,377 క్యూసెక్కులు

సింగూరు ప్రాజెక్టులోకి 3,377 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఆదివారం ఉదయం 6 గంటల నాటికి నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. మంజీర నదీ తీర ప్రాంతంలో కురిసిన ముసురు వానలకు ఈ వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామార్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. కాగా, 519.800 మీటర్లకు 14.324 టీఎంసీ నీటి నిల్వలున్నాయి.

బిల్లులు రాక నిలిచిన పనులు

నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వంలో గత ప్రభుత్వం పలు దఫాలుగా రూ. 5కోట్ల నిధులు కేటాయించింది. భవన ప్రధాన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. అదనపు పనులు చేయాల్సి ఉంది. రెండునెలల్లో అందుబాటులోకి తెస్తారని అందరు ఆశిస్తే.. పదిరోజులుగా పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసేలోపు పనులు పూర్తయ్యేది అనుమానంగానే కనిపిస్తున్నది.

-నర్సాపూర్



ఉరిమే ఉత్సాహం..

రంగనాయకసాగర్‌పై హాఫ్ మారథాన్

ఉత్సాహంగా 21కె, 10కె, 5కె రన్

హెల్త్ ఇండియాగా మార్చాలి : ఎంపీ రఘునందన్‌రావు



రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై పరుగెత్తుతున్న రన్నర్స్

చిన్నకోడూరు, జూలై 28 : చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై ఆదివారం సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఈ హాఫ్ మారథాన్‌లో చిన్నా, పెద్దా పాల్గొన్నారు. గతేడాది ఆగస్టు 6న ఫస్ట్ ఎడిషన్ హాఫ్ మారథాన్ (21కె) నిర్వహించగా, నిన్న సెకండ్ ఎడిషన్ నిర్వహించారు. 21కె, 10కె, 5కె రన్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ హాఫ్ మారథాన్‌లో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి, వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులు సుమారు 3వేల మంది ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా పరుగెత్తారు. ఓ అంధుడు తన స్నేహితుడి సహాయంతో ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొని అందరికీ స్ఫూర్తిగా నిలిచాడు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ డయాబెటిక్ ఇండియాను హెల్త్ ఇండియాగా మార్చాలంటే ప్రతి ఒక్కరూ రోజు ఉదయం గంట సేపు నడక లేదా ఆటలాడాలని పేర్కొన్నారు. భారతదేశంలో డయాబెటిక్ పేషంట్లు కూడా పెరుగుతున్నారని చెప్పారు. బావిభారత పౌరులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటేనే దేశం బాగుటుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఖేలో ఇండియా స్ఫూర్తిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వచ్చే ఏడాది (2025) నిర్వహించే హాఫ్ మారథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు కుటుంబ సమేతంగా పట్టణంలోని తారకరాంనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు



సంగారెడ్డిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో జోగిని నవ్యశ్రీ విన్యాసాలు

7లో

అమ్మకు బోనం..

జోర్దార్‌గా ఊరేగింపులు

శివసత్తుల శిగాలు..

పోతరాజుల విన్యాసాలు

హాజరైన ప్రముఖులు

అసలే టీచర్ల కొరత.. మరో పాఠశాలకు డిప్యూటేషన్

● బదిలీలతో ఖాళీ అవుతున్న ఉపాధ్యాయుల పోస్టులు

అల్లాదుర్గం, జూలై 28 : టీచర్ల కొరత ఉన్న పాఠశాలల నుంచే డిప్యూటేషన్లపై ఉపాధ్యాయులను మరో పాఠశాలకు బదిలీ చేస్తున్నారు. విద్యార్థులున్న పాఠశాలలో అసలే ఉపాధ్యాయుల కొరత ఉందంటే.. అదే పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అల్లాదుర్గం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులుండగా ఇటీవల జరిగిన టీచర్ల బదిలీలో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కానీ, ఈ పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో ఇతర ఉపాధ్యాయులను భర్తీ చేయలేదు. దీంతో ఆ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారు. ఆ ముగ్గురిలో ఓ ఉపాధ్యాయుడిని చిల్వర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కోమటికుంట ప్రాథమిక పాఠశాలకు అధికారులు డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో ఇక ఇద్దరు ఉపాధ్యాయులే దిక్కయ్యారన్నారు. ఈ పాఠశాలలో 61 మంది విద్యార్థులుండగా చిల్వర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉన్నారు. బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని కోమటికుంట పాఠశాలకు డిప్యూటేషన్ వేయకుండా అప్పాజీపల్లి పాఠశాల నుంచి వేయడం ఏమిటంటూ వారు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలోని ఉపాధ్యాయులను వదిలి అధిక సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై బదిలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తుందని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సక్సెస్ స్కూల్‌లోను ఖాళీలే...

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరత తీర్చడంలో మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు మండలంలో వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో ప్రధానమైన సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఏర్పడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఏకంగా ఆరు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడగా ఇందులో ఇంగ్లీష్, భౌతిక రసాయన శాస్త్రం బోధించే నలుగురు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తెలుగు, జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుల పోస్టులు నాలుగు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇలా మండలంలోని పలు పాఠశాలలో ఇదే దుస్థితి నెలకొన్నది. ఇలాగైతే విద్యాప్రమాణాలు ఎలా మెరుగు పడతాయని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఖాళీ ఏర్పడిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.


అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి


కనకయ్య (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 28 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన మండలంలోని చంద్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది రాజిరెడ్డి, వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన గంగాధర కనకయ్య(60) తాపీ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రామంచలోని తన కూతురు ఇంటికి ద్విచక్ర వాహనం (టీవీఎస్ ఎక్సెల్)పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్లాపూర్ గ్రామ శివారులోని పల్లెప్రకృతి వనం సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపైకి ఎక్కే గేటు ద్వారానికి ఢీ కొట్టాడు. దీనితో కనకయ్య తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం కనకయ్యను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కనకయ్యను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కనకయ్యకు భార్య వజ్రవ్వ, కుమారుడు ఉన్నారు.

కుక్కలను ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు

● ఒకరికి తీవ్రగాయాలు... తొగుట వద్ద ఘటన


గాయాలను చూపుతున్న రాజు

తొగుట, జూలై 28 : ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఒక్కసారిగా కుక్కలు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడడంతో తీవ్ర గాయాలైన సంఘటన తొగుటలో సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన చందారాజు తొగుట నుంచి గ్రామానికి మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా ఒక్కసారి ఊర కుక్కలు రోడ్డుపైకి వచ్చి మోటర్ సైకిల్‌ను ఢీకొట్టాయి. దాంతో మోటర్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న చందారాజు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. అతడిని గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడని పరీక్షించిన వైద్యులు అతడికి కాలు విరిగినట్లు నిర్ధారించారు. ఊర కుక్కల బెడద నుంచి వాహనచోదకులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

'అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం'

విద్యార్థులతో నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిద్దిపేట అర్బన్, జూలై 28 : పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిలో భాషా రచనల పట్ల ఆసక్తి కలిగించేందుకు నిర్వహించ తలపెట్టిన 'అవ్వ తాతలకు ఉత్తరాలు రాద్దాం రండి' కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో ఉపాధ్యాయ బృందం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాయలో పడి నేడు ఉత్తరాలు రాసే వారే కరువయ్యారని, నేటి విద్యార్థులకు ఉత్తరాలు అంటే తెలియడంలేదని అన్నారు. ఉత్తరాలపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్, నిర్వాహకులు లక్ష్మయ్య, పూర్ణచందర్రావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, రాజేందర్, రమాదేవి, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, సరిత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఏఈవో సస్పెన్షన్

హుండీ లెక్కింపు సంఘటనతోపాటు

గతంలోని అభియోగాలపై చర్యలు


ఏఈవో గంగా శ్రీనివాస్

చేర్యాల, జూలై 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటువేశారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆలయాధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశారు. మల్లన్న ఆలయంలో గత జాతర సమయంలో ఏఈవో గంగా శ్రీనివాస్ జారీ చేసిన రూ.500 విలువైన వీవీఐపీ పాసులు అమ్ముకుంటూ పలువురు వలంటీర్లు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈవిషయమై ఏఈవో గంగా శ్రీనివాస్‌తో పాటు పలువురు వలంటీర్లపై కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేస్తూ వలంటీర్లను రిమాండ్‌కు పంపించారు. అంతే కాకుండా ఈనెల 16వతేదీన మల్లన్న ఆలయంలో చేపట్టిన హుండీ లెక్కింపుల్లో లభ్యమైన ఓ బంగారు ఉంగరం మాయమవడంతో పాటు బంగారు గొలుసు చెత్తబుట్టలో లభ్యమైంది. ఆ సమయంలో ఏఈవో గంగా శ్రీనివాస్ పర్యవేక్షణ బాధ్యతలో ఉండటంతో అత డిపైనే అనుమానం ఉందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఈవో బాలాజీశర్మ కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే కొద్దిరోజుల క్రితం ఎలక్ట్రీషియన్ అంజయ్యపై చేయిచేసుకున్న విషయంపైనా గంగా శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా పరిణామాలతో పాటు గతంలోనూ గంగా శ్రీనివాస్‌పై అవకతవకలు, అవినీతి అభియోగాలు నెలకొనడం, ఇటీవల చోటుచేసుకున్న బంగారు గొలుసు అపహరణ యత్నం సంఘటనలతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెన్షన్ చేశారు. ఇదిలా ఉండగా, ఈవిషయమై ఏఈవో గంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తాను బంగారం గొలుసు చోరీకి పాల్పడినట్లు నిర్ధారణ జరగకుండానే సస్పెన్షన్ చేయడం సరికాదని పేర్కొన్నారు.


మెదక్‌లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాళికాదేవి మాత



సంగారెడ్డి పట్టణం, వట్‌పల్లి మండల కేంద్రంలో బోనాల ఊరేగింపులో శక్తిరూపాల ప్రదర్శన

అమ్మకు బోనం

జోర్దార్‌గా ఊరేగింపులు

- శివసత్తుల శిగాలు
- పోతరాజుల విన్యాసాలు
- హాజరైన ప్రముఖులు

సంగారెడ్డి రూరల్/కంది/కొండాపూర్/వట్‌పల్లి/నారాయణఖేడ్/కోహీర్/కంగ్టి/ మనూరు/రామచంద్రాపురం/జిన్నారం జూలై 28 : ఆషాఢమాసం చివరి ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బోనాల జాతర హోరెత్తింది. గ్రామాలు, పట్టణాల్లో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల శిగాలు, పోతురాజుల వీరంగంతో మార్మోగింది. సంగారెడ్డిలో ముదిరాజ్, గంగపుత్ర, కుమ్మరి సంఘాల ఆధ్వర్యంలో బోనాలను నిర్వమించారు. పట్టణం శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రధాన రహదారి మీదుగా పాత బస్టాండ్ వద్ద గల దుర్గమ్మ ఆలయం వరకు ముదిరాజ్ కులస్థులు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. బోనాల మహోత్సవంలో జోగిని నవ్యశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపులో శక్తిరూపాల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, నీలం మధు పలువురు పాల్గొన్నారు. కంది మండలంలోని అన్ని గ్రామాల్లో బోనాల ఉత్సవాలు కొనసాగాయి. డప్పుచప్పుళ్ల, డీజే సౌండ్ల పాటల మధ్య బోనాలను ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో గొర్రెపొట్టెళ్లతో ప్రత్యేకంగా తయారు చేసిన ఫలహారం బండ్లు ఆకర్షించాయి. కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో దుర్గమ్మ జాతరోత్సవాలు ఘనంగా జరిగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి రంగాలు నిర్వహించారు. వట్‌పల్లి మండలం గొర్రెకల్‌లో రేణుకా ఎల్లమ్మ దేవతకు నిర్వహించిన బోనాల వేడుకలలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, వరం కమిటి మాజీ అధ్యక్షులు వీరారెడ్డి హజరై భక్తులతో కలసి బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివధ వేషాధారణలో నృత్యాలు అలంరించాయి. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని ఆరేల్లి మైసమ్మ ఆలయానికి అట్టహాసంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మంగల్‌పేట దుర్గా మాత ఆలయంలో అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఖేడ్ పట్టణంలోని మహంకాళి ఆలయం, పోచమ్మల ఆలయాల ఆవరణలో కన్నులపండుగగా బోనాల ఊరేగింపు కొనసాగింది. శాస్త్రీనగర్ గడి మైసమ్మ ఆలయం ఆవరణలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, తదితరులు పాల్గొన్నారు. కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్, వెంకటాపూర్, మనియార్ పల్లి తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు ఘనంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి, ఎన్కెమూరి తదితర గ్రామాల్లో బోనాల జాతర నిర్వహించారు. మనూరు మండలం దోసపల్లి లో నిర్వహించిన బోనాల వేడుకలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నగర సమీపంలోని రామచంద్రాపురం, తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ తదితర ప్రాంతంలో అంగరంగ వైభవంగా బోనాలు కొనసాగాయి. ఉస్మాన్‌నగర్‌లో జరిగిన పోచమ్మ బోనాలను వంశపార్యంగా వస్తున్న తలారి శ్రీలతవిష్ణు ముదిరాజ్ కుటుంబం నుంచి తలారి శంకర్ ఊరు బోనం అమ్మవారికి నివేదించారు. అనంతరం గౌడ కులస్తుల నుంచి నర్సింహ కల్లుఘటాన్ని సమర్పించారు. తెల్లాపూర్‌లో కౌన్సిలర్లు కమ్మెట జ్యోతిశ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించారు. రామచంద్రాపురంలో పలు కాలనీలో జరిగిన బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ 111, 112 డివిజన్ల కార్పొరేటర్లు సింధూ ఆదర్శరెడ్డి, పుష్పనగేష్, జాతీయ యూనియన్ నాయకులు టీవీ రావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొల్లారం మున్సిపాలిటీ సహ అన్ని గ్రామాలలో బోనాల ఊరేగింపులు, దేవాలయాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


వట్‌పల్లి మండలం గొర్రెకల్‌లో బోనంతో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్


సంగారెడ్డిలో బోనంతో మహిళలు

మెదక్‌లో నల్లపోచమ్మకు కలెక్టర్ పూజలు

మెదక్‌అర్బన్/తూప్రాన్/మనోహరాబాద్/రామాయంపేట/పెద్దశంకరంపేట/ శివ్వంపేట/కొల్చారం/అల్లాదుర్గం/హుస్నాబాద్‌రూరల్/వర్గల్, జూలై 28: పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మహాకాళీమాతకు ఘనంగా బోనాలను నివేదించారు. గాంధీనగర్, డబుల్‌బెడ్‌రూం కాలనీలో వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు స్థానిక తారకరాంనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవాల్లో ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, టుబీహెచ్‌కే కమిటీ సభ్యులు ప్రభు, చారి, శ్రీనివాస్, నర్సింలు, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూన రవీందర్ తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, మనోహరాబాద్, ధర్మారాజుపల్లి, గ్రామాలలో బోనాలు కొనసాగాయి. కాళ్లకల్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రామాయంపేట పట్టణంలో మహంకాళి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తల్లి వాణి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ తదితరులు మాతను దర్శించుకున్నారు. పెద్దశంకరంపేటలోని భవానీమాత అమ్మవారికి అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. శివ్వంపేటతో మండలంలోని దొంతి, గోమారం, తదితర గ్రామాల్లో బోనాల ఊరేగింపులు కొనసాగాయి. గోమారం, శివ్వంపేటలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్చారంలో బొడ్రాయి, కోటమ్మ, రేణుక ఎల్లమ్మ, పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు బోనం సమర్పించారు. అల్లాదుర్గంలో కట్టమైసమ్మ దేవతకు భక్తులు బోనాలను సమర్పించారు. హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి, కూచనపల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. వర్గల్ గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, కనకదుర్గమ్మ ఆలయాలకు మహిళలు డప్పుచప్పుళ్ల, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు.


మెదక్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు


పెద్దశంకరంపేటలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు


హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో


జిన్నారంలో శిగాలూగుతున్న మహిళలు


కొల్చారంలో బోనాల ఊరేగింపు


తూప్రాన్‌లో బోనంతో వంటేరు ప్రతాప్‌రెడ్డి


మనూరు మండలం దోసపల్లిలో పోతురాజుల వీరంగం


వర్గల్‌లో బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు


నారాయణఖేడ్ పరిధిలో మైసమ్మకు బోనాల ఊరేగింపు


కంది మండలం బ్యాతోల్‌లో బోనాల ఉత్సవం


కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో


సంగారెడ్డిలో బోనాల ఊరేగింపు నీలం మధు


సంగారెడ్డిలో పలారం బండి ఊరేగింపులో పులిమామిడి రాజు



తూప్రాన్‌లో డప్పుచప్పుళ్లు, శివసత్తుల శిగాల మధ్య మహంకాళి ఆలయానికి తీసుకొస్తున్న బోనాలు, మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సన్మానం

చదువుతో పేదరికాన్ని ముడి పెట్టవద్దు

- సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

తొగుట/మిరుదొడ్డి, జూలై 28: చదువుకు పేదరికాన్ని ముడిపెట్టవద్దని, చదువు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగునింపుతుందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని ముత్యంపేట పిట్టలవాడ గ్రామంలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలను విడనాడితేనే పేదరికం నుంచి గట్టెక్కుతారన్నారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆరు విభాగాల వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరుగురు విద్యార్థులకు ఆయన ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత వేదిక ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి, సంతోష్, రుక్మిణీ, వైద్యులు అరవింద్, విజయ్‌భాస్కర్, సాయి, శిరీష, అరుణ్‌కుమార్‌రెడ్డి, సందీప్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలంలోని అందే గ్రామంలో ఆదివారం సామాజిక సామరసత వేదిక, గ్రామీణ చేతన వికాస సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని గ్రంథాలయాన్ని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరంలో సుమారు ఆరువందల మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్‌బాబు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


తొగుట మండలం పిట్టలవాడలో సైకిళ్లను పంపిణీ చేస్తున్న అప్పాల ప్రసాద్

అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి వృద్ధురాలి నగలు అపహరణ

రాయపోల్, జూలై 28: ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉన్నట్లు గమనించిన దుండగులు అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి ఆమె ఒంటిపై ఉన్న నగలు లాక్కొని వెళ్లిన సంఘటన రాయపోల్‌లో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. రాయపోల్‌కు చెందిన నర్సవ్వ(70)కు భర్త చనిపోగా, పిల్లలు లేకపోవడంతో మేనకోడలు కోల సత్తవ్వను దత్తత తీసుకుంది. సత్తవ్వ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 26న శుభకార్యం నిమిత్తం బెజుగామకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం రాత్రి నర్సవ్వ అన్నం తిని గడియ పెట్టుకొని పడుకున్నది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమె ఇంటి విద్యుత్ నిలిపివేసి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి నర్సవ్వ చెవిపై ఉన్న 15 గ్రాముల బంగారు గంటీలు, మెడలో ఉన్న 20 గ్రాముల బంగారు గుండ్లు, 200 గ్రాముల వెండి కాళ్ల పట్ట గొలుసులు లాక్కొని పరారయ్యారు. గంటీలు లాగడం వల్ల ఆమె చెవులకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితురాలి మేనకోడలు సత్తవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూ కేటాయింపులు సరే.. పరిశ్రమలు ఎక్కడా?

- టీజీఐఐసీ ద్వారా పరిశ్రమల కోసం భూసేకరణ
- ఉత్పాదన, ఉపాధి రంగాల కోసం విలువైన స్థలాల అందజేత
- ఏళ్లు గడుస్తున్నా కనిపించని పరిశ్రమల జాడ
- భూములు కొల్లగొడుతున్నారని ఆరోపణలు

జిన్నారం, జూలై 28 : రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని గత ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్‌ఐపాస్‌తో భూములు దక్కించుకున్న సంస్థలు ఏళ్లు గడుస్తున్నా ఉత్పాదన కేంద్రాల ఏర్పాటు చేపట్టకపోవటంతో లక్ష్యం నెరవేరటం లేదు. ఉపాధి కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నది. మరోవైపు విలువైన భూములు కాజేసేందుకు పరిశ్రమల స్థాపన పేరుతో కొందరు స్థలాలు దక్కించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసైన్డ్ భూముల సేకరణతో జీవణోపాధి కోల్పోతున్నామని రైతులు ఆందోళనలు చేపట్టి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పరిశ్రమల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టకపోవటంతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కోసం నిరీక్షిస్తున్న మండల వాసులకు అసలు పరిశ్రమల స్థాపన జరిగేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికే స్థలాలు కేటాయించిన గ్రామాల్లో ఆయా సంస్థలు ప్రహరీలు, ఫెన్సింగ్‌ల ఏర్పాటుతో చేతులు దులుపుకున్నాయి తప్ప అసలు ఉత్పత్తి చేసే ప్లాంట్ల నిర్మాణాలు ఏర్పాటు చేయడంలేదు.

స్థలాల చుట్టూ ప్రహరీలు

నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలంలలో భూములకు భారీగా విలువ ఉన్నది. ఈ నేపథ్యంలో ఇక్కడ పరిశ్రమల స్థాపన కోసం కొందరు టీఎస్ (ప్రస్తుతం టీజీ) ఐఐసీ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. ఉపాధి రంగాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం స్థలాలు అందుబాటులో ఉంటే 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులను మంజూరు చేసింది. ఈ పథకం కింద మండలంలోని శివానగర్‌లో 114 సర్వే నంబర్‌లో 118 ఎకరాల అసైన్డ్ స్థలాన్ని సేకరించి ఎల్‌ఈడీ బల్బుల పరిశ్రమల కోసం కేటాయించారు. ఇక్కడ ఏడేళ్లలో రోడ్డు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించినా ఇప్పటి వరకు 30 ఎకరాల్లో 10కి మించి చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు జగింది. మరో 60 శాతం స్థలం ఖాళీగానే ఉన్నది. ఇక గడ్డపోతారం పరిధిలోని అల్లీనగర్ 27 సర్వే నంబర్‌లోనూ భూ కేటాయింపులు జరుపగా అక్కడ పలు చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఇంకా కేటాయించిన స్థలంలో పూర్తిగా పరిశ్రమల నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల కోర్టు నుంచి అనుమతులు పొందిన రెండు మూడు చిన్న తరహా పరిశ్రమలు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాయి. ఇంకా 10 ఎకరాల్లో పరిశ్రమల నిర్మాణం జరగాల్సి ఉన్నది. అదే విధంగా మంగంపేటలో సర్వే నంబర్ 55లో మూడేళ్ల క్రితం 22 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించిన టీఎస్‌ఐఐసీ అధికారులు ఓ హెలీకాప్టర్ విడి భాగాల తయారీ సంస్థకు భూమిని కేటాయించారు. ఇంతవరకు ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదు. సెక్యూరిటీని నియమించి స్థల రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. కాగా జిన్నారం సర్వే నంబర్ 1లో 36 ఎకరాలను ఏడాదిన్నర క్రితం ఓ సంస్థకు కేటాయించారు. ఇటీవల స్థలం పొందిన సంస్థ 35 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రారంభించగా ఉత్పాదన జరిగే పరిశ్రమ ఏర్పాటు పనులు మాత్రం చేపట్టలేదు. ఇక స్థలాలు పొందిన వారు ఏళ్లు గడుస్తున్న పలు కారణాలతో పరిశ్రమల ఏర్పాటులో జాప్యం చేస్తున్నాయి. కొత్తగా వావిలాల 189 సర్వే నంబర్‌లోనూ పరిశ్రమల కోసం అసైన్డ్ భూముల కేటాయింపులకు రంగం సిద్ధం కావటం గమనార్హం.


మంగంపేట వద్ద ఓ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలం చుట్టూ రేకులతో ఏర్పాటు చేసుకున్న ప్రహరీ

పరిశ్రమల పేరిట విలువైన భూముల ధారాదత్తం

పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యం కొందరికి కల్పతరువుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త పరిశ్రమల కోసం అసైన్డ్, ప్రభుత్వ భూములను కారు చౌకగా దక్కించుకుని ఏళ్లు గడుస్తున్నా ఉత్పాదనలు చేపట్టని తీరుపై సందేహాలు నెలకొన్నాయి. మండలంలో ఎకరం రూ.2 నుంచి 4 కోట్ల వరకు ఉన్న ప్రాంతంలో పరిశ్రమలకు 30 నుంచి 55 లక్షలకే ఎకరం కేటాయించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు 5 ఎకరాలు అవసరం ఉంటే 20 నుంచి 30 ఎకరాల వరకు కేటాయింపులు జరుపటం గమనార్హం. ఇప్పటికే కొన్ని చోట్ల మూతపడ్డ పరిశ్రమలు ఆయా స్థలాలను విక్రయించటం లీజుకు ఇస్తుండగా.. కొత్త పరిశ్రమల కోసం ఎడాపెడా విలువైన భూముల కేటాయింపులు చేపట్టడంపై విమర్శలు ఉన్నాయి. కాగా టీజీఐఐసీ భూ కేటాయింపులలో దళారులు కూడా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూకేటాయింపుల నుంచి అనుమతుల వరకు ఈ వ్యవహారంలో కొందరు చక్రం తిప్పుతున్నారని ప్రచారం జరుగుతుంది. కొత్త ప్రభుత్వం మండలంలో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలాలపై సమీక్ష జరిపి కాలపరిమితి పాటించని పరిశ్రమల భూకేటాయింపులు రద్దు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


దొంతి-గుండ్లపల్లి రోడ్డుపై వంతెన కిందిభాగంలో జారిపోయి కిందపడిన రాళ్లు

పొంచిఉన్న ప్రమాదం

- గుండ్లపల్లి శివారులో ప్రమాదకరంగా బ్రిడ్జి
- వంతెన కుంగి కూలిపోయిన బండరాళ్లు

శివ్వంపేట, జూలై 28: ప్రధాన రహదారిలో బ్రిడ్జి కుంగిపోయి బండరాళ్లు ఊడిపోవడంతో తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. పలు గ్రామాలకు వెళ్లే రహదారి కావడంతో ఎప్పుడు కూరుకుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించక తప్పని దుస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని దొంతి, గుండ్లపల్లి ప్రధానరోడ్డు గుల్లపల్లి శివారులోని మల్లమ్మ ఆలయ సమీపంలో దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన కుంగిపోయి దెబ్బతిన్నది. దీంతో కింది భాగంలో బండరాళ్లు పూర్తిగా తొలగిపోయి ప్రమాదకరంగా మారింది. సుమారు పది గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఇదే ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతు షఫియోద్దీన్ మాట్లాడుతూ పలు గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గల బ్రిడ్జి కుంగిపోయి రాళ్లు క్రమంగా తొలగిపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఒకవేళ ఈ బ్రిడ్జి కూలితే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని తెలిపాడు. సంబంధిత అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

17వ రోజుకు దీక్ష

నర్సాపూర్, జూలై 28: నర్సాపూర్‌లో సంగారెడ్డి కెనాల్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రిలేనిరాహార దీక్ష ఆదివారం 17వ రోజుకు చేరింది. ఆదివారం చిన్నచింతకుంట, చెన్నాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన రైతులు మహేష్‌గౌడ్, నర్సింహారెడ్డి, నిశాంత్‌రెడ్డి, ప్రభాకర్, నగేష్, శ్రీశైలంయాదవ్, హన్మంతు, ప్రేమ్ పాల్గొన్నారు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు

- జహీరాబాద్‌లో చిరు జల్లులకే చిత్తడవుతున్న రోడ్లు
- గుంతల్లో నీరు నిలిచి ఇక్కట్లు
- గాయాలబారిన పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

జహీరాబాద్, జూలై 28: జహీరాబాద్ పట్టణంలో సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయి. ఆయా రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. చిరు జల్లులు కురిస్తే చాలు ఆయా సర్వీస్‌రోడ్లపై ప్రయాణం నరకప్రాయమే. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అల్గోల్ వెళ్లే రోడ్డుపై రూ. 80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డు పరిస్థితి దయనీయంగా తయారైంది. ఏడాదికాలంగా బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగున్నాయి. ఈ క్రమంలో బ్రిడ్జి పక్కన వేసిన సర్వీస్‌రోడ్డు మాత్రం పూర్తిగ పాడైంది. అలాగే రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద వేసిన సర్వీస్‌రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారుల ఇబ్బందులు అంతాఇంతా కాదు. బ్రిడ్జికి సంబంధించి బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఐదారేళ్లగా బ్రిడ్జి పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. సుమారు అరకిలోమీటరు మేర వేసిన సర్వీస్‌రోడ్డు పూర్తిగ పాడైంది. ఎక్కడపడితే అక్కడ మోకాలు లోతు గుంతలు పడడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా వర్షం పడుతున్న క్రమంలో సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆయా సర్వీస్ రోడ్లపై ద్విచక్రవాహనదారులు ఎంతజాగ్రత్తగా వాహనాలను తోలినప్పటికీ ఏదో సమయంలో స్కిడ్ అయి వాహనదారులు గాయాలబారిన పడిన సందర్భాలు కోకొల్లలు. అలాగే మాణిక్ ప్రభుమహేశా, సిద్ధేశ్వరాలయానికి వెళ్తేందుకు వీలుగా బైపాస్‌రోడ్డు పక్కన ఉన్న సర్వీస్‌రోడ్డు వేయకపోవడంతో పట్టణప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్‌రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎల్‌అండ్‌టీ అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్లకు మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


జహీరాబాద్‌లోని డౌన్‌టౌన్ నుంచి అల్గోల్ వెళ్లే దారిలో బ్రిడ్జి వద్ద బురదమయంగా సర్వీస్‌రోడ్డు


రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద అధ్వానంగా సర్వీస్‌రోడ్డు

బురదమయంగా అండూర్ రహదారి

జిన్నారం, జూలై 28: మండలంలోని అండూర్ గ్రామంలో ప్రధాన రహదారి బురదమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలకు ప్రధాన రహదారిలో బీటీ కొట్టుకుపోయి మట్టి బురదమయంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.


బీటీ కొట్టుకుపోయి బురదమయమైన రోడ్డు

మెదక్ సీఎస్ఐలో భక్తుల ప్రార్థనలు

మెదక్ కల్చరల్ జూలై 28: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ప్రెసిబేటరీ ఇంచార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఆలయంలో ప్రార్థనలో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మికతతో పరవశించిపోయారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మత గురువులు ఆశీర్వచనాలందించారు.


సీఎస్ఐలో భక్తుల సందడి

రేపు రెండో విడత రైతు రుణమాఫీ

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండో విడత నిధులను ఈ నెల 30వ తేదీన విడుదల చేయనున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారుల సమక్షంలో రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

హుగ్గెల్లిలో హోటల్‌ను ప్రారంభించిన స్పీకర్


ప్రారంభోత్సవంలో కేక్‌ను కట్ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్, తదితరులు

జహీరాబాద్, జూలై 28: మండలంలోని హుగ్గెల్లి గ్రామశివారులో 65వనెంబరు జాతీయరహదారి పక్కన కొత్తగా నిర్మించిన ఓ హోటల్‌ను ఆదివారం అసెంబ్లీస్పీకర్ గడ్డంప్రసాద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్పీకర్‌కు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పీకర్ కేక్‌ను కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు, హోటల్ యజమానులకు తానే స్వయంగా తినిపించారు. కార్యక్రమంలో కార్మికసంఘం నాయకుడు హుగ్గెల్లిరాములు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మహ్మద్‌ఖాజా, నాయకులు కిషన్, రాజు, సునీల్‌కుమార్, సంపత్‌కుమార్ ఉన్నారు.

కారు ఢీకొని మున్సిపల్ కార్మికుడి మృతి

- మరో బాలుడికి తీవ్రగాయాలు


మైసయ్య(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 28: కారు ఢీకొన్న ఘటనలో మున్సిపల్ కార్మికుడు మృతి చెందగా.. మరో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలోని దుర్గా కాలనీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల మైసయ్య(53) కొన్నేళ్లుగా మెదక్ మున్సిపాలిటీలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. ఉదయం 6:30 ప్రాంతంలో దుర్గాకాలనీలో మురికి కాలువ శుభ్రపరిచేందుకు వెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని నిలిపి ట్రాక్టర్‌లో చెత్తా వేస్తున్న క్రమంలో మంబోజిపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు సడన్ బ్రేక్ వేడయంతో అదుపు తప్పి పల్టీకొట్టి మైసయ్యను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే నడుచుకుంటూ వెళ్తున్న బాలుడు సాత్విక్(11)ను కూడా కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు


కాలువలో మునిగిన కారు

నారాయణఖేడ్, జూలై 28: కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లగా తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన నిజాంపేట్- నారాయణఖేడ్ - బీదర్ 161బీ జాతీయ రహదారి పై నిజాంపేట మండలం మునిగేపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని బీదర్ జిల్లా ఔరాద్‌కు చెందిన ప్రశాంత్, బాబురావులు కొన్నేళ్ల క్రితం కూకట్‌పల్లి, హౌజింగ్‌బోర్డు కాలనీలో ఉంటూ ప్రైవేటు వైద్యశాలలో వైద్యులుగా పని చేస్తున్నారు. వారు ఆదివారం తమ సొంత గ్రామమైన ఔరాద్‌కు వెళ్లి అక్కడి ప్రైవేటు వైద్యశాలల్లో దంత వైద్య సేవలు అందిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం ఔరాద్‌కు కారులో వెళ్తుండగా, మునిగేపల్లి సమీపంలోని మూల మలుపులో వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. కారులోని బెలూన్‌లు తెరుచుకోవడంతో పాటు సమీపంలోని రైతులు హుటాహుటిన చేరుకొని, కారు అద్దాలు పగులగొట్టి ఇరువురిని క్షేమంగా బయటకు తీసుకు వచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఘటనాస్థలంలో పరిశీలన చేస్తున్న పోలీసులు

కౌడిపల్లి, జూలై 28: మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెంకగౌని అంజాగౌడ్ కుటుంబంతో కలిసి శనివారం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తాళం ధ్వంసమై ఉండటంతో చుట్టు పక్కల వారు వెంటనే బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా ఇంట్లోని బీరువాలో దాచిన రూ. లక్ష 77 వేల నగదుతో పాటు 4 తులాల బంగారం , 70 తులాల వెండి చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రంజిత్ రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను నురప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బదిలీ పై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

మెదక్ కల్చరల్, జూలై 28: మెదక్ మండలంలోని శివాయిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశం బదిలీపై వెళ్లడంతో ఆయనకు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి మాధవి రవీందర్, మాజీ ఎంపీపీ లక్ష్మీకిష్టయ్య, మాజీ ఎంపీటీసీ శాంతవ్వ సిద్ధయ్య, మాజీ ఉపసర్పంచ్ కుర్తివాడ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

శిరీషపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

చిన్నశంకరంపేట, జూలై 28: పెరువంచ కల్లూరు మండలం ఖమ్మం జిల్లా పరిధిలోని హైస్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు డి.శిరీషను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆమెకు న్యాయం చేయాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదివారం డిమాండ్ చేశారు. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచే బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందని, అందులో భాగంగా క్రమశిక్షణ చర్యలు తీసుకున్న ఉపాధ్యాయురాలు శిరీషను సస్పెండ్ చేస్తున్నట్లు హెడ్మాస్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిచరణ్, సిద్దేష్, సంజీవ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

బ్రహ్మంగారి కాలనీలో నీటి ఎద్దడి

రేగోడు జూలై 28: వర్షాకాలంలోనూ నీటి ఎద్దడి తప్పడం లేదు. మండల కేంద్రం రేగోడులోని బ్రహ్మంగారి కాలనీలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నది. మిషన్ భగీరథ కుళాయిలు ఉన్నా నీరు రావడంలేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీవాసి శ్రీనాథ్‌చారి తెలిపారు. దాదాపు 50ఇళ్లకు నీటి సరఫరా జరగడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను కొనసాగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేద రైతులకు అండగా సీపీఎం

చేగుంట, జూలై 28: పేద రైతుల పక్షాన సీపీఎం పార్టీ పోరాడుతుందని సీపీఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. మండలంలోని చిట్టోజిపల్లి గ్రామం సర్వే నంబర్ 266/1 గతంలో భూదాన్, సీలింగ్ చట్టం ప్రకారం సర్టిఫికెట్లు పొందిన వారికి భూములు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు చిట్టోజిపల్లి గ్రామంలో ఆదివారం రైతులతో కలిసి భూముల వద్ద మల్లేశం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలో కొంత మంది రైతులకు 2004లో భూదాన్ చట్టం ప్రకారం సుమారు 192 రైతులకు 400 ఎకరాల భూమి పంపిణీ చేశారు. ఇదే 266/1 సర్వే నంబర్ లో 318 ఎకరాల మిగులు భూమి ఉందని, ఆ భూమిపై ఇబ్రాహింపూర్‌కు చెందిన పలువురు కోర్టులో కేసు వేసి పదేళ్లగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేసు కోర్టులో ఉండగానే వివాదంలో ఉన్న భూమిని గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టు పట్టా రైతులకు నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు మద్దతుగా చిట్టోజిపల్లి గ్రామా భూ పరిరక్షణ పోరాట కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెర్వు తండాకు రోడ్డు నిర్మించాలి

- రామాయంపేట- మెదక్ రోడ్డుపై ధర్నా

హవేళిఘణపూర్, జూలై 28: తమ గ్రామానికి రోడ్డు గుంతలతో బురదమయంగా మారిందని, వెంటనే బీటీ రోడ్డు వేయాలని తండాల ప్రజలు ఆదివారం మెదక్-రామాయంపేట రోడ్డు పై ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. హవేళిఘణపూర్ మండలంలోని కొచ్చెర్వు తండా గ్రామానికి వెళ్లే దారిగుండా ఔరంగాబాద్ తండా, కొచ్చెర్వు తండా, గాజులవాయి తండాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలు జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నా బీటీ రోడ్డు వేయడం లేదంటూ ఆరోపించారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు వానలకు రోడ్డు (దారి) చిత్తడిగా మారి బురదలో వెళ్లేందుకు వాహనదారులు, పాదాచారులు నానా తిప్పలు పడాల్సి వస్తుందని వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో తండాలకు 108 వాహనం సైతం రాకపోవడంతో రోగులను ఏదోవిధంగా తంటాలు పడుతూ 3 కి.మీల వరకు తీసుకు రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు దృష్టి సారించి తమరోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు. కార్యక్రమంలో తండా నాయకులు శ్రీను నాయక్, రంజిత్ నాయక్, రెడ్యా నాయక్, మోహన్, గణేష్, హరి, గోపాల్, సేవ్యా నాయక్, తండాప్రజలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కొచ్చెర్వు తండా ప్రజలు

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన గురువు శివప్రసాద్, సభ్యులు

సంగారెడ్డి రూరల్, జూలై 28 : మాంసాహారాన్ని విస్మరించి శాఖాహారులుగా మారడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన గురువు మారం శివప్రసాద్ అన్నారు. శాకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఆదివారం సంగారెడ్డిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, మాంసాహారం మానివేసి ఆరోగ్యవంతమైన జీవితాలను గడపాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్వర మహా పిరమిడ్ ధ్యానసంస్థ సభ్యులు మాధవి, దామోదర్ రెడ్డి, లక్ష్మీ, భూపతి రాజు, రాజేష్, సాయిలు, ప్రకాష్‌రావు, మల్లన్న, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి


ముత్యాలమ్మ సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి, మహిళలు

నర్సాపూర్, జూలై 28: నర్సాపూర్ పట్టణంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న గ్రామదేవతల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం ముత్యాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు పురప్రముఖులు, పలువురు నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

వడియారంలో యువతి అదృశ్యం


మాశ్రిత

చేగుంట జూలై 28: మండలంలోని వడియారం గ్రామంలో ఆదివారం ఓ యువతి అదృశ్యమైంది. చేగుంట ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం వడియారం గ్రామానికి చెందిన పోతుల మాశ్రిత(23) ఈ నెల 23న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన సర్టిఫికెట్లు తీసుకొస్తానని సంగారెడ్డి జిల్లా పసల్వాది గ్రామంలోని చిన్నమ్మ రుద్రారం భావన వద్దకు వెళ్తున్నట్టు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని తెలిపారు. బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తూప్రాన్‌లో వృద్ధురాలు..


సుల్తాన

తూప్రాన్, జూలై 28: పింఛన్ డబ్బులు తెచ్చుకోడానికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ సంఘటన తూప్రాన్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద శనివారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నివాసముండే ఎస్‌కే సుల్తాన (60) శనివారం సాయంత్రం 4గంటలకు పోస్టాఫీసులో పింఛన్ తెచ్చుకోడానికి ఇంట్లోంచి వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురు హీనా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

365వ రోజుకు 'సాహితీ' బాధితుల నిరసన



ఆందోళన కొనసాగిస్తున్న సాహితీ బాధితులు

పటాన్‌చెరు, జూలై 28: అమీన్‌పూర్‌లో సాహితీ ఎలైట్ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రీలాంచ్ పేరిట భారీమోసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సుమారు 1,200ల మంది బాధితుల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయలను వాపస్ ఇవ్వాలని బాధితులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారంనాటికి 365వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ప్రీలాంచ్ పేరుతో పెద్ద ఎత్తున నగదు వసూళ్లు చేసి బోర్డు తిప్పేసిన సాహితీ ఎలైట్ సంస్థ ఆస్తులను జప్తు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద రియల్ ఎస్టేట్ మోసానికి పాల్పడిన సాహితీ సంస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణ అప్పటి తెలంగాణా ప్రభుత్వ పెద్దల అండతో పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. బాధితుల్లో ఎక్కువశాతం మధ్యతరగతి, వేతన జీవులే ఉన్నారని, సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు అప్పులు చేసి డబ్బులు చెల్లించామని వాపోయారు. ప్రీ లాంచ్ బాధితులకు సాహితీ సంస్థ గుప్పిట్లో ఉన్న ఎకరాల కొద్ది భూముల్లో ప్లాట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో హెచ్ఎండీఏ, రేరా, పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశామన్నారు. సంస్థపై కేసులు నమోదు చేశారు తమకు ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీశ్రేణులు

నారాయణఖేడ్, జూలై 28: ప్రధాని మోదీ చేపట్టిన 112వ మన్‌కీ బాత్‌ను ఆదివారం నారాయణఖేడ్‌లో బీజేపీ శ్రేణులు వీక్షించాయి. ఈ సందర్భంగా మోదీ చేపట్టిన పథకాలను తెలుసుకొని, ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయిరాం, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్ సూచించారు.కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు సతీష్‌కుమార్, ప్రశాంత్, పట్నంమాణిక్, సాయేందర్, ఆనంద్, మురళీ, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో బంగారు పతకం సాధించిన అమోఘ్


విజేతగా సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి అమోఘ్

సంగారెడ్డి రూరల్, జూలై 28 : హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మొదటి ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో అంకుర పాఠశాలకు చెందిన విద్యార్థి అమోఘ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచి ఆదివారం బంగారు పతకాన్ని అందుకున్నాడు. ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, కరెస్పాండెంట్ సురేష్ విద్యార్థిని అభినందించారు.

మారేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొండాపూర్, జూలై 28: మండల పరిధిలోని మారేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం సదాశివపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు గియాసోద్దీన్, నరేందర్ కుమార్, వెంకటేశ్వర్లకు పూలమాలలు వేసి సన్మానించారు. పరస్పర క్షేమసమాచారాలు తెలుసుకుంటూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం కోలాటం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు 120మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అందించిన సేవలు చిరస్మరణీయం



నారాయణఖేడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్,జూలై 28: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే చిరస్మరణీయమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మనూరు మండలం దోవూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం. వడిత్యా మాణిక్ ఉద్యోగ విరమణసభ నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న హెచ్ఎంను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, బంజారా సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, దిగంబర్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, బాధ్యులు మన్మథ కిషోర్, నర్సింహులు, ప్రసన్నకుమార్, మధుసూదన్‌రెడ్డి, మహేష్‌కుమార్, మేఘ్యానాయక్, పీపీ రాథోడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


బొల్లారంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం, జూలై 28: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిభారాణి, వేణుబాబు, వైశాలి, సత్యం, శ్రీనివాస్‌రావు, లీలావతి, సుశీల, ప్రసన్నను ఆదివారం చైర్‌పర్సన్ రోజారాణి, హెచ్ఎం మంగీలాల్‌లు సన్మానించారు.

పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

నర్సాపూర్, జూలై 28: నర్సాపూర్ మండలంలో గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయులుగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆదివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో బుచ్యానాయక్ హాజరు కాగా, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, చందర్, చిన్న, సత్యనారాయణ, సునీత, సత్యవతి, పెంటయ్య, సబితా, కవిత, శ్రీకాంత్, రాజిరెడ్డి, శేఖర్, హేమలత, నాయుడును సన్మానించారు.

గంగాపూర్‌లో ఘనంగా పసక పండుగ

నారాయణఖేడ్, జూలై 28: వర్షాకాలంలో వానలు సక్రమంగా కురియడంతో పాటు పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని కోరుకుంటూ మండల పరిధిలోని గంగాపూర్‌లో ఆదివారం పసక పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పాల్గొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు మల్గొండ, మాజీ ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి'

కల్హేర్, జూలై 28: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని నారాయణఖేడ్ అసెంబ్లీ కో కన్వీనర్ నగేష్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మాసాన్‌పల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి అధ్యక్షతన కల్హేర్ మండల బీజేపీ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నగేష్‌యాదవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన పనితీరును కార్యకర్తలు, నాయకులు కనబరిస్తే తప్పకుండా విజయం సాధిస్తామని ఆయన వివరించారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు కరణం సంగమేశ్వర్‌రావ్, రాపర్తి మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలకళాశ్రీ అవార్డు అందుకున్న నివేదిత


అవార్డు అందుకుంటున్న నివేదిత

కంగ్టి, జూలై 28: కంగ్టికి చెందిన వడ్ల నివేదిత జాతీయ స్థాయిలో బాలలకు అందజేసే ప్రతిష్ఠాత్మకమైన బాలకళా శ్రీ అవార్డును కైవసం చేసుకుంది. వడ్ల దత్తాత్రి, శ్రీలతల కుమార్తె నివేదిత గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతుంది. కూచిపూడి నాట్యంపై మంచి పట్టు సాధించింది. సంస్కార భారతీ జాతీయ సాంస్కృతిక సంస్థ, నవ కళాభారతి సంయుక్తంగా టీవీ రంగయ్య ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో బాలల నాటకోత్సవాల్లో ఉత్తమప్రతిభ కనబర్చిన నివేదితకు బాలకళా శ్రీ అవార్డు దక్కింది. బీజేపీ జాతీయ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు టీవీ రంగయ్యలు అవార్డును అందజేశారు.

108 ఈఎంటీ ప్రవీణ్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు

కల్హేర్, జూలై 28: 108 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ సేవలు అందించిన మండలంలోని మీర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన నీరుడి ప్రవీణ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. తెలంగాణా రాష్ట్ర జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ 108 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కు ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్, సంగారెడ్డి జిల్లా ఈఎంఈ షేక్ శాలి హుసేన్, ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌లు ప్రవీణ్‌కు అవార్డును అందజేశారు. సంగారెడ్డి ఎంసీహెచ్ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా ప్రవీణ్ విధులు నిర్వహిస్తున్నాడు.